క్లుప్తంగా

జేఎన్‌టీయూకే అభివృద్ధి ప్రశంసనీయం



సెంచూరియన్ వర్సిటీ వీసీ రాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు: విజయనగరం సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు శనివారం జేఎన్‌టీయూకేను సందర్శించారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద రాజుతో సమావేశమై వర్సిటీ అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఆంధ్రాయూనివర్సిటీ వీసీగా ఉన్న సమయంలో ప్రొఫెసర్ రాజు ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, ఈయన హయాంలో యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు ఆ వర్సిటీ మార్గదర్శకంగా నిలిచిందన్నారు. అనంతరం ప్రొఫెసర్ రాజును సత్కరించారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే సకాలంలో పూర్తిచేయాలి



కరపలో స్వామిత్వ సర్వేపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

కరప: స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) సర్వేలో భాగంగా గృహ యజమానులకందరికీ ఆస్తిహక్కు పత్రాలు ఇచ్చేందుకు గ్రామకంఠం, ఆవాస ప్రాంతాల్లో సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌పీఓ అన్నామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పలు సూచనలిచ్చారు. సర్వే పూర్తయిన తర్వాత వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామ కార్యదర్శులతో పారిశుధ్య పనుల నిర్వహణ, పంచాయతీ పన్నుల విధింపుపై డీఎల్‌పీఓ సమీక్షించారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, వి.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఏఐసీసీ ద్వారా మరిన్ని సామాజిక సేవలు



సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్ష, కార్యదర్శులు రిక్కీ గూటమ్, స్టీఫెన్ ఆనంద్

కాకినాడ రూరల్: నగరంతో పాటు గ్రామీణ ప్రాంతంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) ద్వారా 11వేల రకాల పండ్ల మొక్కలు నాటామని, మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు బ్రదర్ రిక్కీ గూటమ్, రెవరెండ్ డాక్టరు స్టీఫెన్ ఆనంద్ తెలియజేశారు. రమణయ్యపేటలో రాయుడుపాలెం వద్ద సీటీసీ ప్రాంగణంలో ఏఐసీసీ కార్యవర్గ సమావేశం స్టీఫెన్ ఆనంద్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలుపై సమీక్షించారు. కార్యక్రమంలో కోశాధికారి రెవరెండ్ పాల్ రాజ్‌కమల్, శామ్యూల్ జోసెఫ్, రెడ్డి అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

'బెజవాడ'కు సత్కారం



సత్యనారాయణను సన్మానిస్తున్న కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: జేఎన్‌టీయూకే ఈసీ సభ్యుడిగా నియమితులైన తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణను శనివారం రమణయ్యపేటలోని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ళ సుబ్బారావు, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు తదితరులు సన్మానించినవారిలో ఉన్నారు.



కాకినాడ రూరల్ వాకలపూడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సత్యనారాయణ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు



తూరంగిలో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘాల ప్రతినిధులు

ప్రజల మనసుల్లో వైఎస్సార్ సుస్థిరం

- ఎంపీ, ఎమ్మెల్యేలు గీత, ద్వారంపూడి
- మహానేతకు ఘనంగా నివాళులు

కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెంది 14 ఏళ్లు గడిచినప్పటికీ ఆయన అమలు చేసిన పథకాలు, పంచిన ఆత్మీయత రూపంలో ప్రతి ఒక్కరి హృదయంలో జీవించే ఉన్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. మహానేత వర్ధంతి సందర్భంగా స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లోని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి ఎంపీతో పాటు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఎంపీ గీత మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి ఎన్నో సమర్థవంతమైన పథకాల ద్వారా పేదల హృదయాల్లో వైఎస్సార్ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. ఆస్తులకు మాత్రమే వారసులుంటారని, ఆయన ఆశయాలకు మాత్రం ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి వారసునిగా వచ్చి ఆంధ్రప్రదేశ్‌ను తండ్రికి మించిన తనయునిగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు ఎలా కట్టుబడి ఉండాలో వైఎస్సార్ వద్దే నేర్చుకున్నామన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రజలకు సేవ చేసే విషయంలో ఆయన ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచారని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఆయన వద్ద ఎమ్మెల్యేలుగా పనిచేసే అవకాశం దక్కడం తాను ఎన్నటికీ మరచిపోలేనన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బాదం మధు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జేసీఎస్ కన్వీనర్లు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ కార్పొరేటర్లు కంపర బాబి, సంగాని నందం, రాజారపు వెంకటలక్ష్మి, చవ్వాకుల రాంబాబు, పలక సూర్యకుమారి, చిట్నీడి మూర్తి, లంకే హేమలత, గద్దేపల్లి దానమ్మ, జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు మన్నే నాగేశ్వరరావు, మహిళలపై దాడుల నిరోధక కమిటీ సభ్యురాలు కృష్ణప్రియ, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గంలో..

కాకినాడ రూరల్: మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నియోజవర్గంలో ఘనంగా నిర్వహించారు. సంక్షేమ పథకాలతో ప్రజలు హృదయాలతో శాశ్వతంగా నిలిచిపోయిన వైఎస్సార్‌ను ప్రజలు గుర్తు చేసుకున్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, కాకినాడ రూరల్, కరప జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ళ సుబ్బారావు, కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు చిన్నా, పిల్లి చక్రరావు, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్, పుల్ల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ రాజశేఖరరెడ్డి పాలన స్వర్ణయుగమన్నారు. ఆయన పాలనలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో



కరపలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు, ఎంపీపీ తదితరులు

రైతుల గుండెల్లో భగీరథుడిగా నిలిచిపోయారన్నారు. వాకలపూడి గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ గ్రామ నాయకులు గొల్లపల్లి జగన్, గంపల సత్యనారాయణ, కరీం బాషా, నల్ల రాణి తదితరులు నివాళులర్పించారు. తిమ్మాపురంలో సర్పంచ్ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బందిలి వీరీష, తదితరులు, సూర్యారావుపేటలో సూరాడ రాజు, మత్స్యకారులు, కొవ్వాడలో తోటకూర శ్రీను తదితరులు నివాళులర్పించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అడబాల రత్నప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

కరప మండలంలో..

కరప: మండలంలో మహానేత రాజన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వాడవాడలా వైఎస్సార్‌కు నివాళులర్పించి, మహానేతను స్మరించుకున్నారు. స్థానిక పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్‌ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులతో కలసి నివాళులర్పించారు. వేములవాడలో ఎంపీటీసీ సభ్యుడు పాలిక శ్రీనివాస్, కమిడి శంకర్, వజ్రపు కామేశ్వరరావు, బండే వీరబాబు మహానేతకు నివాళులర్పించారు. వేళంగిలో ఉప సర్పంచ్ కుంచే అయ్యన్న, జె.రాంబాబు, కె.గుణ, యండమూరులో మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, సర్పంచ్ మార్నెళ్ల శివ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, షేక్ దరియాలు, పెదకొత్తూరులో గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, ఎం.ఏసు, ఎం.వీర్రాఘవులు మహానేత విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నక్కా వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, సోడగం సూరిబాబు, సింగినేని నానీ, భోగిరెడ్డి సూర్యనారాయణ, గోన శ్రీనివాస్, దాలిపర్తి శ్రీనివాస్, మార్నెళ్ల వెంకటరమణ, సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, పలివెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వేళంగిలో నివాళులు అర్పిస్తూ..

తూరంగిలో మహానేత వర్ధంతి

కాకినాడ సిటీ: రూరల్ మండలం తూరంగి పంచాయతీలోని పగడాలపేట, వెలమల తూరంగి, రాజులతూరంగి, పంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహానేత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ

తూరంగి సాయిబాబా గుడి వద్ద సామాజికవేత్త నల్లమిల్లి విశ్వనాథరెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి ఆవిష్కరించారు. విగ్రహ దాత నల్లమిల్లి విశ్వనాథరెడ్డిని సంఘం నాయకులు సత్కరించారు. ఇందులో భాగంగా మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పేదలకు మందులు ఉచితంగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లమిల్లి మాచారెడ్డి, తూరంగి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు టి.నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



యండమూరులో మండల పార్టీ అధ్యక్షుడు చింతా, సర్పంచ్ నివాళులు



తిమ్మాపురంలో నాయకుల నివాళి..



సూర్యారావుపేటలో మత్స్యకారుల నివాళులు..



వేములవాడలో అంజలి ఘటిస్తూ..

జగన్ పాలనలోనే పేదల సంక్షేమం

- పింఛన్ల పంపిణీలో ఎంపీ గీత
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, కమిషనర్
- 559 మందికి కొత్త పింఛన్ల పంపిణీ

కాకినాడ: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో శనివారం జరిగిన కొత్త పింఛన్ల పంపిణీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు హాజరయ్యారు. ఎంపీ గీత మాట్లాడుతూ దేశం మొత్తం మీద ప్రభుత్వ పథకాల అమలుకు ఓ కేలండర్ ద్వారా తేదీలను ప్రకటించి అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి సీఎం జగన్ పింఛన్ల సొమ్మును దశలవారీగా రూ.3వేలు వరకు పెంచుతున్నారన్నారు. టీడీపీ హయాంలో కాకినాడ సిటీలో 13,772 పింఛన్లు ఉండగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం 26,788 మందికి పింఛన్లు అందిస్తున్నామని, ప్రతి నెల రూ.7.5 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ పురపాలకశాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు జీవితాంతం రుణపడి ఉండేలా ప్రభుత్వ పరంగా జీతాలు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. కాకినాడ సిటీలో కొత్తగా 559 పింఛన్లు మంజూరయ్యాయని, పెండింగ్ దరఖాస్తులను కూడా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేషన్ కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ జీతాలకు కూడా డబ్బులు లేని దయనీయస్థితిలో ఉండే చిన్నచిన్న పురపాలకసంఘాలకు వైఎస్సార్ ఇచ్చిన చేయూతవల్లే ఇప్పుడు ఎంతో మంది సంతోషంగా జీవించగలుగుతున్నారన్నారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్ అతిథులను వేదికపైకి ఆహ్వానించగా, వారు వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లకు సంబంధించిన చెక్కును విడుదల చేశారు. వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.



పింఛన్ల చెక్కును విడుదల చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఎమ్మెల్యే ద్వారంపూడి

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్‌కు ఉత్సవ సమితి వినతి

కాకినాడ సిటీ: ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న గణపతి ఉత్సవాలకు, 26, 27 తేదీల్లో జరిగే నిమజ్జనం ఏర్పాట్లకు ప్రభుత్వం సమావేశం నిర్వహించాలని నగర గణేష ఉత్సవ సమితి కలెక్టర్ కృతికా శుక్లాను శనివారం కలసి వినతి పత్రం అందించారు. సాధారణ మండపాలకు గృహ, దుకాణాల్లోని విద్యుత్ వినియోగించుకునే వెసులు బాటు ఇవ్వాలని, పూజా కార్యక్రమాలకు చలానా రహిత మైక్ అనుమతులివ్వాలని, ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల మరమ్మతులు చేయించాలని కోరారు. అలాగే ఉప్పుటేరు వినాయకసాగర్‌లో మూడు అడుగుల విగ్రహాల నిమజ్జనానికి గత అనుమతులు కొనసాగించాలని, రూరల్ మండలం వాకలపూడి బీచ్ వద్ద ముందస్తు ఏర్పాట్లు ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సమితి నాయకులు దూసర్లపూడి రమణరాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, రంబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందజేస్తున్న నగర గణేష్ ఉత్సవ సమితి నాయకులు

గడప గడపకూ విశేష స్పందన

- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, నేతలు

కాకినాడ: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల్లో విశేష స్పందన కనిపించింది. స్థానిక 45వ డివిజన్ కొండయ్యపాలెంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు. నాలుగేళ్ళ పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వ పరిపాలన పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ ఇళ్లలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వాన్ని ప్రజలంతా మరోసారి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ కర్రి శైలజ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, స్థానిక నాయకులు వాకాడ సత్తిబాబు, కర్రి కిశోర్, చిన్న, పార్థసారధి, రామస్వామి, కృష్ణ, పండు, శ్రీను పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

నేడు నృత్య నీరాజనం

కాకినాడ కల్చరల్: స్థానిక దంటు కళాక్షేత్రంలో శాస్త్రీయ నృత్య కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో స్వర్గీయ నాట్యాచార్య ఆనెం లక్ష్మణరావుకు నివాళిగా ఆదివారం 12 గంటల పాటు నృత్య నీరాజనం నిర్వహించనున్నట్టు సమాఖ్య కార్యదర్శి ఆనెం ప్రసాద్ తెలిపారు. నాట్యాచార్య ఓవీఎన్ వరప్రసాద్‌కు, అఖిల భారత తెలుగు సేన అధ్యక్షుడు పీఎస్ఎన్‌కు, మేకప్ ఆర్టిస్టులు అశపు రాము, అశపు లక్ష్మిలకు ఆనెం లక్ష్మణరావు స్మారక జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. కళాభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆనెం కోరారు.





మీసాల వెంకన్నకు ప్రత్యేక పూజలు

కరప: మండలం యండమూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రావణమాసం సందర్భంగా వంశపారంపర్య అర్చకులు పెద్దింటి సీతారామం ప్రత్యేక పూజలు చేశారు. మీసాల వెంకటేశ్వరస్వామిగా పిలిచే స్వామివారిని దర్శించి, ఏడువారాలు, ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని అర్చకుడు సీతారామం తెలిపారు. శనివారం స్వామి దర్శనానికి కాలి నడకన వచ్చిన పరిసర గ్రామాల భక్తులకు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు చింతా ఈశ్వరరావు, పెదకొత్తూరు మాజీ సర్పంచ్ చింతా దుర్గాశ్రీ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ మార్నెళ్ల శివ, వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, మీసాల చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశుని అలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: శ్రావణ మాసం సందర్భంగా శనివారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామి వారు వేంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ఉదయం పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామిని వేంకటేశ్వరస్వామిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



యండమూరులోని మీసాల వెంకన్న



వేంకటేశ్వరస్వామిగా సీతారామస్వామి